సాక్షి జగిత్యాల

బుధవారం ⦁ 25 ⦁ సెప్టెంబర్ ⦁ 2024



కొండగట్టు ఆలయంలో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తుల ఏర్పాట్లను ఈవో రామకృష్ణారావు, ఏఈవో అంజయ్య, అధికారులు ఉమామహేశ్వరరావు, ధర్మేందర్ పర్యవేక్షించారు.



తల్లి మందలించిందని..

ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు 16 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

8లో▸


గరిష్టం/కనిష్టం 30.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు కొనసాగుతాయి.

‘పది’ సిలబస్.. చేరేనా టార్గెట్?

సాక్షి ఫోకస్



టీచర్ల బోధన.. విద్యార్థుల చదువు ముందు నుంచి ఒక ప్రణాళిక ప్రకారం సాగితేనే పదోతరగతిలో మంచి ఫలితాలు వస్తాయి. డిసెంబర్ 31 నాటికి పాఠ్యాంశాల బోధన పూర్తి చేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 50 శాతం వరకు సిలబస్ పూర్తయిందని డీఈవోలు చెబుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో బడిబాట, టీచర్ల బదిలీలు, పదోన్నతులు, స్వచ్ఛతా హీ సేవ, పోషణ్ అభియాన్ వంటి కార్యక్రమాలు, ఎఫ్ఎల్ఎన్ శిక్షణతో కొంత ఇబ్బంది కలిగినా.. నష్టపోయిన సమయాన్ని పూడ్చేందుకు ప్రత్యేక దృష్టిసారించామని అంటున్నారు. అయితే, వరుస సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తి చేయడం సాధ్యమేనా అన్న సందేహాలను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

- 50 శాతం పూర్తి..
- శతశాతానికి మిగిలింది 3 నెలలు
- అక్టోబర్ నెల సగం దసరా సెలవులే..
- లక్ష్యాన్ని చేరేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామంటున్న డీఈవోలు
- ఉమ్మడి జిల్లాలో 1,931 పాఠశాలలు


కాల్వశ్రీరాంపూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి

పెద్దపల్లిలో కలెక్టర్ నజర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జెడ్పీ 100,ఉన్నత పాఠశాలలు 04, ఆదర్శ 07, మైనారిటీ గురుకులాలు 04, ఎయిడెడ్ 05, కేజీబీవీలు 10, గురుకులాలు 10, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు 172 ఉన్నాయి. వీటిల్లో 19 వేల మందికి పైగా విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఆయా స్కూళ్లలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన జరిగేలా విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. వచ్చే నెలలో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గతేడాది ఫలితాల్లో జిల్లా 92.4 శాతం సాధించి, రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచిందని, ఈసారి అంతకన్నా మెరుగైన ఫలితాలు రావాలని సూచించారు.

సమ్మేటివ్ పరీక్షలకు సిద్ధం



ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన సాగుతోంది. అక్టోబర్ 21 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాం. ఇప్పటివరకు ఉన్న లక్ష్యాల మేరకు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సిలబస్ పూర్తయింది.
– పీఎం షేక్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి


కథలాపూర్ స్కూల్లో ప్రత్యేక తరగతులు (ఫైల్)

జగిత్యాల హ్యాట్రిక్ నుంచి 24వ స్థానం

జగిత్యాల: జగిత్యాల 2016-17, 2017-18, 2018-19 పదోతరగతి ఫలితాల్లో వరుసగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి, హ్యాట్రిక్ సాధించింది. గతేడాది 84.05శాతం ఉత్తీర్ణతతో 24వ స్థానానికి పడిపోయింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 13, జిల్లా పరిషత్ 175, ఆదర్శ 13, కేజీబీవీలు 14, బీసీ వెల్ఫేర్ 06, మైనారిటీ 05, టీఎస్ రెసిడెన్షియల్ 02, సోషల్ వెల్ఫేర్ 5, ప్రైవేట్ పాఠశాలలు 104 మొత్తం 337 స్కూళ్లు ఉన్నాయి. 11,991 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 50 శాతం సిలబస్ పూర్తి చేశామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ.. పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. జనవరి 1 నుంచి ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. టీచర్లు సీ-గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అయితే, సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తవుతుందా అని తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

వందశాతం ఫలితాలకు చర్యలు



పదోతరగతిలో వందశాతం రిజల్ట్స్‌కు చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సిలబస్ డిసెంబర్ 31 వర కు పూర్తయ్యేలా చూస్తాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. – జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

కరీంనగర్‌లో ఇన్‌చార్జి ఎంఈవోలే..

కరీంనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి సిలబస్ అటూఇటుగా 50 శాతం పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తం 16 మండలాలు ఉంటే అన్నిచోట్లా ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారు. దీంతో టీచర్లపై పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలున్నాయి. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేసి, వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మెరుగైన ఫలితాలు రావడానికి అస్కారం ఉంటుంది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు, క్రిస్మస్‌కు నాలుగు రోజులతోపాటు సాధారణ సెలవులు ఉండనున్నాయి. మరి డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తవుతుందో లేదో వేచిచూడాలి. వీలైనంత త్వరగా సిలబస్ పూర్తి చేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా 95 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి, రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది.

జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలు 65, ఎంపీపీ/జెడ్పీ 598, కేజీబీవీ 14, ఆదర్శ 11, ప్రైవేట్ 323, ప్రైవేట్ ఎయిడెడ్ 12, ఎస్సీ గురుకులాలు 08, బీసీ గురుకులాలు 11, మైనార్టీ గురుకులాలు 09, స్పోర్ట్స్ స్కూల్ 01, అర్బన్ రెసిడెన్షియల్ 02 మొత్తం 1,060 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో పదోతరగతి విద్యార్థులు మొత్తం 12,695 మంది ఉన్నారు.


ఇటీవల తిమ్మాపూర్‌లోని జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేసి, భోజనం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులు



పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశాం. నిరంతర పర్యవేక్షణకు తనిఖీలు చేపడుతున్నాం. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి, ఫలితాల్లో కరీంనగర్‌ను ముందంజలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దసరా సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. – జనార్దన్‌రావు, డీఈవో

గతేడాది సిరిసిల్లకు మూడోస్థానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పదోతరగతి ఫలితాల్లో జిల్లా ఏటా మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. గత మూడేళ్లలో ఏడో స్థానం నుంచి మూడో స్థానానికి ఎగబాకింది. గతేడాది 98.27 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రస్తుతం మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. దసరా సెలవులకు ముందు సగం సిలబస్ పూర్తి చేశామని, డిసెంబర్‌లోగా శతశాతం చేరుకుంటామని అంటున్నారు. కానీ, ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కారణంగా కొన్ని పాఠశాలల్లో 40 శాతమే పూర్తయినట్లు పలువురు సీనియర్ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 ముగిసేనాటికి సగం సిలబస్ అవుతుందంటున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 114, గురుకుల రెసిడెన్షియల్ 20, ఆదర్శ 07, కేజీబీవీలు 13, ప్రైవేటు 68 మొత్తం 222 పాఠశాలలున్నాయి.6,890 మంది పదోతరగతి చదువుతున్నారు.

అల్పాహారానికి నిధులు ఎలాగో?

ఏటా పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల సమయంలో గోరుముద్ద పేరిట అల్పాహారం అందిస్తున్నారు. దీనికి విద్యాశాఖ నిధులు కేటాయిస్తున్నా ఆయా పాఠశాలల పరిధిలోని దాతలు, ఎన్నారైలు, ప్రజాప్రతినిధులు విద్యార్థుల శ్రేయస్సు కోసం అల్పాహారానికి తమవంతు సాయం చేసేవారు. అయితే, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తే రాజకీయం అవుతుందన్న చర్చ గతంలో జరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి అల్పాహారం కోసం నిధులు ఎలా సమకూరుస్తారో వేచిచూడాలి.


సిరిసిల్ల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

ప్రథమ స్థానమే ధ్యేయం



పదోతరగతి ఫలితాల్లో గతేడాది జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈ విద్యాసంవత్సరం ప్రథమ స్థానమే ధ్యేయంగా మరింత మెరుగైన విద్యాబోధన చేపడుతున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటాం. లక్ష్య సాధనలో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని హెచ్ఎంలకు, టీచర్లకు సూచించాం. – రమేశ్, డీఈవో

న్యూస్‌రీల్

తాగునీటి సమస్య రాకుండా చూడాలి


రికార్డులు పరిశీలిస్తున్న గౌతమ్‌రెడ్డి

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. జగిత్యాల ఎంపీడీవో కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. నీటి సరఫరాలో లోపాలు రానీయొద్దని, క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని పేర్కొన్నారు. లీకేజీలకు మరమ్మతు చేయాలన్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో సలీం, ఈఈలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, పగటి ఉష్ణోగ్రతలు 33 నుంచి 34 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 22 నుంచి 24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

వరదకాలువకు 15 వేల క్యూసెక్కుల నీటి విడుదల


వరదకాలువలో ప్రవహిస్తున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 45,858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ మెయిన్ కెనాల్‌కు 6,800 క్యూసెక్కులు, లక్ష్మికెనాల్‌కు 50, మిషన్ భగీరథకు 231, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలి


మాట్లాడుతున్న ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి

ధర్మపురి: ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను ప్రభుత్వం అమలు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాల్ల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీలను విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. ఎంఈవో పోస్టులను భర్తీ చేస్తేనే నాణ్యమైన బోధనకు అవకాశం ఉంటుందన్నారు. మండల బాధ్యులు గణేశ్, రాజేందర్‌రెడ్డి, భోగ శివప్రసాద్, వేణుగోపాల్, కిరణ్, వంశీ తదితరులున్నారు.

జీవో 317తో ఉద్యోగులకు న్యాయం చేయాలి


ఉపాధ్యాయులకు సభ్యత్వం అందిస్తున్న దేవయ్య, ప్రసాద్‌రావు

కథలాపూర్: జీవో 317తో నష్టపోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య కోరారు. మంగళవారం కథలాపూర్ మండలం సిరికొండ, తక్కళ్లపెల్లి, కథలాపూర్, గంభీర్‌పూర్, అంబారిపేట గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేపట్టారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఎంఈవో, డెప్యూటీ డీఈవో, డైట్ లెక్చరర్ పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానంను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి బోయినపెల్లి ప్రసాద్‌రావు, నాయకులు వంతడుపుల రవికుమార్, చంద్రశేఖర్‌రావు, అందె శివప్రసాద్, న్యాలం వెంకటేశ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి ఎదురుచూపు

జగిత్యాలఅగ్రికల్చర్: రూ.రెండు లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెల్సిందే. ఆ మేరకు ఇప్పటివరకు మూడు విడతలుగా రుణమాఫీ చేసినప్పటికీ వివిధ కారణాలతో చాలామంది రైతులకు మాఫీ వర్తించలేదు. దీంతో రైతుల్లో అయోమయం నెలకొంది. తమకు మాఫీ వర్తిస్తుందా..? లేదా..? తెలియక ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వ్యవసాయ శాఖ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండడం రైతులకు కొంత ఉపశమనం కలిగిస్తున్నా.. ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పేవారు లేక తికమకపడుతున్నారు.

- ఇప్పటివరకు మాఫీ అయ్యింది రూ.549.41 కోట్లు
- ఇంకా కావాల్సింది దాదాపు రూ.600 కోట్లపైనే
- రైతుల్లో నెలకొన్న అయోమయం
- మాఫీ వర్తింపజేయాలని ఆందోళనలు

జిల్లాలో 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు సుమారు 1.25లక్షల మంది వివిధ బ్యాంకుల్లో రూ.1200 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. ఆ రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల్లో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక అమలు చేసింది. ఈ మేరకు మొదటి విడత కింద రూ.లక్షలోపు రుణాలు ఉన్న 39,253 మందికి రూ.207.99కోట్లు, రెండో విడత కింద రూ.లక్షన్నరలోపు రుణాలున్న 19,623 మందికి రూ.169.08 కోట్లు, మూడోవిడత కింద రూ.రెండు లక్షలలోపు రుణాలు ఉన్న 13,799 మందికి రూ.172.34 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయి. మొత్తంగా 72,675 మంది రైతులకు రూ.549.41 కోట్లు మాఫీ అయ్యాయి. ఈ లెక్కన ఇంకా సుమారు 40వేల మంది రైతులకు సుమారు రూ.600 కోట్లకు పైగానే మాఫీ కావాల్సి ఉంది. తాము రుణమాఫీకి అన్ని విధాలా అర్హులమని, అయినా మాఫీకాలేదని సుమారు ఐదువేల వరకు గ్రీవెన్స్‌సెల్‌కు దరఖాస్తులు వచ్చాయి. మాఫీ కాని రైతులు మండలాల్లోని వ్యవసాయాధికారులు, ఏఈఓలకు దరఖాస్తు చేశారు.

లబ్ధిదారుల వివరాల కోసం ప్రత్యేక యాప్

పంట రుణమాఫీ వర్తించని లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. తొలుత యాప్‌లో రేషన్ కార్డు లేని రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. పంట రుణం తీసుకుని రేషన్‌కార్డు లేనివారు 11,827మంది రైతులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వారి వివరాలను యుద్ధ ప్రతిపాదికన యాప్‌లో అప్‌లోడ్ చేసి, నిర్ధారణ కోసం వ్యవసాయాధికారి, రైతుతో కలిసి ఫొటో దిగుతున్నారు. మరికొంతమంది రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేయకపోవడంతో అధికారులతో వాగ్వివాదానికి దిగుతున్నారు.

రైతుల్లో పెరుగుతున్న అయోమయం

రైతులందరికీ మాఫీ చేస్తామని పభుత్వం ప్రకటించినా అందరికీ కాకపోవడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో ప్రతిరోజు ఏదో రీతిన నిరసన తెలియజేస్తూనే ఉన్నారు. జిల్లా రైతులు సుమారు రూ.1200కోట్ల మేర రుణాలు తీసుకోగా.. మూడు విడతల్లో కలిపి ఇప్పటివరకు కేవలం రూ.549.41కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. ఇంకా దాదాపు 40వేల మందికి రూ.600 కోట్లకు పైగానే మాఫీ కావాల్సి ఉంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సెంట్రల్ సర్వర్‌లో జరిగిన పొరపాటుతో కెనరా బ్యాంకు, ఇండియన్ బ్యాంకుల్లో రుణం తీసుకున్న దాదాపు 5 వేల మందికి రూ.51కోట్ల వరకు మాఫీ కాలేదని సమాచారం. రుణం తీసుకున్న ఖాతా రద్దు కావడం, భార్యాభర్తల పేరున రుణం ఉండడం.. అలాంటి ఖాతాలు నిర్ధారణ కాకపోవడం, అన్నదమ్ములు భూములు పంచుకుని వేరు కుటుంబం పెట్టినా ఒకే కుటుంబంగా నమోదు కావడం వంటి కారణాలతో చాలామందికి రుణమాఫీ కాలేదు. అలాగే రూ.రెండు లక్షలకు పైగా రుణం ఉన్న వారి వివరాలు కూడా మాఫీ జాబితాలో లేవు. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు రూ.రెండు లక్షలకుపైగా ఉన్న డబ్బులను చెల్లిస్తున్నారు. ఇలాంటి వారి కోసం అధికారులు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో రైతులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వానికి తెలిసేలా నిరసన వ్యక్తం చేస్తున్నారు.


పంట రుణమాఫీ కోసం ఆందోళన చేస్తున్న రైతులు

వివరాలు పంపిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక యాప్‌లో రుణమాఫీ కాని రైతుల వివరాలు నమోదు చేస్తున్నాం. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం అడిగిన వివరాలను ఎప్పటికప్పుడు అందిస్తున్నాం.
– వాణి, జిల్లా వ్యవసాయాధికారి

రైతువేదికకు తాళం వేసి రైతుల నిరసన

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం కళ్లుతెరిచి అర్హులందరికీ రుణమాఫీ చేయాలని, రైతుభరోసా విడుదల చేయాలని మండలకేంద్రంలోని రైతువేదికకు తాళం వేశారు రైతులు. వ్యవసాయ అధికారులను బయటకు పంపించి నిరసన వ్యక్తం చేశారు. ఆగస్టు 15లోపు ప్రతి రైతుకూ రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, తమకు ఇప్పటివరకు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం పంటలకు పెట్టుబడి కింద రైతుభరోసా వేయలేదని పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో యాసంగి సీజన్ ప్రారంభంకానుందని, రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవో రాజ్‌కుమార్ కు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన వ్యక్తం చేసి తహసీ ల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. రైతులు ఎలేటి చిన్నారెడ్డి, సరసం హరి ప్రసాద్, తీగల విక్రంరెడ్డి, నాంపల్లి రమేశ్, కళ్లెం చిన్న సాయన్న, తీగల రవీందర్‌రెడ్డి, బాస జలేందర్, బద్దం సత్యారెడ్డి, ఏలేటి ప్రతాప్, పడాల రా జేందర్, రాజారెడ్డి, కొప్పెల ముత్తన్న, జీవీ.సంతోష్ పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో రైతువేదికకు తాళం వేస్తున్న రైతులు

క్రీడాకారుల అభ్యున్నతికి కృషి


క్రీడాకారుల వందనం స్వీకరిస్తున్న నేతలు

జగిత్యాలటౌన్: క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రీడాపోటీలను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. డీఈవో జగన్మోహన్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి రవికుమార్, ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మిరాం, జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పెటా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు పడాల కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, శ్రీనివాస్, భాస్కర్, వేణు పాల్గొన్నారు. తొలిరోజు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జగిత్యాల రూరల్, సారంగాపూర్, గొల్లపల్లి, మల్యాల, కథలాపూర్, ఇబ్రహీంపట్నం జట్లు విజేతలుగా నిలిచాయి.

ఖమ్మం వరద బాధితులకు రెండు నెలల వేతనం


విరాళాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఖమ్మం వరద బాధితుల సహాయార్థం తన రెండు నెలల వేతనం అందించానని, వారికి మరింత సహాయం చేసేందుకు కలిసి పనిచేద్దామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న తెలంగాణ ఉద్యమ, నిరుద్యోగ కళాకారులు సంఘం రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ మంగళవారం ఆవిష్కరించారు. ఖమ్మంలో వరదల కారణంగా అనేక మంది నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకునేందుకు విరాళాల సేకరణలో తానూ పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ రమేశ్, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ పెట్టుబడితో మోసపోయిన మహిళ

జగిత్యాల క్రైం: ఓ మహిళ ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి, మోసపోయింది. ఎస్సై వేణుగోపాల్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన మహిళ ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని స్నేహితుల ద్వారా తెలుసుకుంది. డై అనే యాప్‌కు సంబంధించిన లింక్ ఓపెన్ చేసి, రిజిస్ట్రేషన్ చేసుకుంది. తర్వాత అందులో మూడుసార్లు మొత్తం రూ.1.78 లక్షల పెట్టుబడి పెట్టింది. సోమవారం యాప్ ఓపెన్ కాలేదు. దీంతో తాను మోసపోయినట్లు నిర్ధారించుకొని, మంగళవారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎన్‌సీసీతో రక్షణ దళాల్లో ఉద్యోగావకాశాలు



జగిత్యాల: ఎన్‌సీసీతో రక్షణ దళాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆర్మీ అధికారి సుబేదార్ అన్నారు. స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. 9వ బెటాలియన్ ఆర్మీ అధికారి సుబేదార్, మనోజ్‌సింగ్, ఉపేందర్ సింగ్ పాల్గొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇందులో చేరాలని, తద్వారా క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ.. ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల నుంచి చాలామంది ఉన్నారని, ఇది తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అసోసియేషన్ సీసీ అధికారి లెఫ్టినెంట్ రాజు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ.. బాలికలకు ఆత్మరక్షణ

- విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యం
- జిల్లాలో 206 పాఠశాలల ఎంపిక
- రూ.3.90 లక్షల నిధులు మంజూరు
- వచ్చేనెల నుంచి శిక్షణ ప్రారంభం



మల్లన్నపేట బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్

గొల్లపల్లి: ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లిన చిన్నారులు.. సాయంత్రం క్షేమంగా ఇంటికి చేరేవరకూ తల్లిదండ్రులకు నిత్యం టెన్షన్ తప్పడం లేదు. బాలికలు ఏదో విధంగా వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఒంటరిగా బయటకు వెళ్తే చాలు ఆకతాయిలు, పోకిరీల ఆగడాలు, వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో లైంగికదాడుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి బాలికలకు ఆత్మ రక్షణ తప్పనిసరి అయ్యింది. దీనిని గుర్తించిన ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే ఆత్మరక్షణ విద్యలో బాలికలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ‘రాణి ఝాన్సీలక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్’ పేరుతో కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది.

జిల్లాలలో 206 పాఠశాల్లో శిక్షణ

కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలోని 206 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే బాలికలకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం రూ.3.90 లక్షలు విడుదల చేసింది. వచ్చే నెల నుంచి మూడు నెలలపాటు 36 తరగతుల చొప్పున శిక్షణ ఇవ్వనున్నారు. నెలకు 12 తరగతులు చొప్పున నిపుణులైన శిక్షకులతో తర్ఫీదు ఇవ్వనున్నారు.

ఆత్మస్థైర్యం నింపేలా..

బాలికలకు పాఠశాలస్థాయి నుంచే కరాటేలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం నింపడంతోపాటు మానసిక దృఢత్వం పెంపొందనుంది. విద్యార్థినులు, యువతుల రక్షణ కోసం షీ టీంలు తదితర వాటితో వివిధ రకాలుగా తోడ్పాటు అందిస్తున్నాయి. అదే కోవలో వారికి స్వీయ రక్షణ కల్పిస్తూ భరోసా నింపాలన్నా ఉద్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ విద్యాలయాల్లో ఆత్మరక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. బాలికల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తుంది. అనుచిత పరిస్థితులు ఎదురైనప్పుడు బాలికలే స్వయంగా ప్రతిఘటించడంతోపాటు ప్రమాదం నుంచి బయటపడేల మెలకువలను ఈ శిక్షణలో వివరించనున్నారు. శిక్షకులకు నెలకు రూ.5 వేల చొప్పున 3 నెలలకు ఒక్కొక్కరికి రూ.15వేల పారితోషకం చెల్లించనున్నారు.

ఆత్మ విశ్వాసం పెరుగుతుంది

కరాటే శిక్షణతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో బాలికలకు 3 నెలల పాటు ఆత్మరక్షణపై శిక్షణ తరగతులను నిర్వహించునాన్నం. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. కరాటే మాస్టర్లను ఎంపిక చేస్తున్నాం. మహిళా మాస్టర్లకు అవకాశం ఉంటుంది.

– డీఈవో జగన్మోహన్ రెడ్డి

జాబ్ చేయాలంటూ తల్లి మందలించిందని..

- ఈ నెల 8న కొడుకు ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- తల్లిపై దాడికి యత్నించిన స్థానికులు
- అడ్డుకొని, బాధితురాలిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- జగ్గాసాగర్‌లో ఘటన



ప్రభాస్ (ఫైల్)



మృతుడి తల్లికి రక్షణగా ఉన్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు 16 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి అతని తల్లి మందలించడమే కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసుల ఎదుటే ఆమెపై దాడికి యత్నించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రభాస్(19) హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్నాడు. ఈ నెల 8న ఇంటివద్దే క్రిమిసంహార మందు తాగాడు. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఆ తర్వాత నిజామాబాద్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లారు. కాగా, జాబ్ చేయాలంటూ తల్లి మందలించడంతో ప్రభాస్ మనస్తాపానికి గురై, ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ప్రతాప్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

తల్లిపై దాడికి యత్నించిన గ్రామస్తులు

ప్రభాస్ మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారని తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అతని మృతికి తల్లే కారణమంటూ ఆగ్రహంతో ఆమెపై దాడికి యత్నించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసులు వద్దని చెప్పినా వారు వినిపించుకోలేదు. పరిస్థితి చేయిదాటిపోవడంతో ఆమెను ఇంట్లో ఉంచి, రక్షణ కల్పించారు. ఒక దశలో స్థానికులు ఆ ఇంటిపైకి రాళ్లు విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇంట్లోకి చొచ్చుకెళ్లి, దాడికి చేసేందుకు ప్రయత్నించడంతో మెట్‌పల్లి ఎస్సై–1 చిరంజీవి, ఎస్సై–2 రాజు, సిబ్బంది ఆమెను చాకచక్యంగా తమ వాహనంలో కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ గ్రామానికి చేరుకొని, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

నిలిచిన అంత్యక్రియలు

ప్రభాస్ మృతదేహానికి అంత్యక్రియలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు, 4 ఎకరాల భూమి మృతుడి తల్లి పేరిట ఉన్నాయి. వాటిని బుధవారం అతని తండ్రి ప్రతాప్‌కు బదలాయించాకే అంత్యక్రియలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

రెండు రకాల ఫిర్యాదులు

ప్రభాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతని తండ్రి ప్రతాప్ గల్ఫ్ నుంచి వచ్చాడు. మొదట పాయిజన్ ఇచ్చి, హత్యాయత్నం చేశారని భార్యతోపాటు మరొకరిపై ఫిర్యాదు చేశాడు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. మంగళవారం మాత్రం జాబ్ చేయమని తల్లి మందలించిందని, ఆ కారణంగానే పాయిజన్ తీసుకున్నాడని మరో ఫిర్యాదు చేశాడు. ఇలా భిన్నమైన కారణాలు చూపుతూ రెండు ఫిర్యాదులు చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

- 28వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలి
- రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి నాగిరెడ్డి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని, ఈనెల 28 నాటికి ఇంటింటి సర్వే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి నాగిరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే 90 శాతానికిపైగా ఇంటింటి సర్వే పూర్తయిందని, 28వరకు వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదుకు సంబంధించి ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు నోటీసులు జారీ చేసి తొలగించాలన్నారు. ఆధార్ నంబరు సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టం ఉంటేనే ఇవ్వొచ్చని, బలవంతం చేయవద్దని పేర్కొన్నారు. నూతన ఓటరు కార్డుల ముద్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేషన్, టీచర్ల నియోజకవర్గ స్థానాల ఎన్నికకు ఈనెల 30న పబ్లిక్ నోటీసు జారీ చేసి ఓటరు నమోదు చేయాలన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్నా.. మరోసారి ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో సమగ్ర వ్యక్తిత్వ వికాసం



మనోహరాచారిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

జగిత్యాల: జాతీయ సేవా పథకం 1969లో 40వేల మంది వాలంటీర్లతో మొదలై ప్రస్తుతం 38లక్షల వాలంటీర్లను కలిగి ఉందని, విద్యార్థులు క్రమశిక్షణ, సేవ దృక్పథం అలవర్చుకుని ప్రగతి నిర్మాణానికి దోహదపడుతున్నారని జాతీయ అవార్డు గ్రహీత మనోహరాచారి అన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులందరూ వాలంటీర్లుగా ముందుకు రావాలని, సేవ దృక్పథాన్ని అలవర్చుకుని గ్రామీణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రకృతిని పరిరక్షిస్తూ ప్రజాస్వామిక విలువలను కాపాడాలని సూచించారు. ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువతపైనే ఉందని, మంచికోసం పోరాడాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీలత, సుజాత, రాంచంద్రం, నీరజ, జమున, సునీత పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరొచ్చు

- డీఎంహెచ్‌వో సమియోద్దీన్



మాట్లాడుతున్న సమియోద్దీన్

జగిత్యాల: దివ్యాంగులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరొచ్చని డీఎంహెచ్‌వో సమియోద్దీన్ అన్నారు. అంతర్జాతీయ సాంకేత భాష వారోత్సవాల సందర్భంగా మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చెవుడు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సాంకేత భాషపై అవగాహన పెంచుకోవాలన్నారు. చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారి అర్చన, సంతోష్, శ్రీధర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం కేటాయించండి

జగిత్యాలటౌన్: అల్లీపూర్ మహిళా సమాఖ్య నిర్వహిస్తున్న ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఆ గ్రామ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. అల్లీపూర్ కేంద్రంగా గతంలో మహిళా సమాఖ్య (ఐకేపీ) ధాన్యం కొనుగోలు చేసిందని, ప్రస్తుతం సమాఖ్య కొనుగోలుకు ఆసక్తి కనబరచడం లేదని, దానిని రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీకి అనుమతించాలని కోరారు. అల్లీపూర్ రైతు సమాఖ్య నాయకులు జీవన్‌రెడ్డిని జిల్లాకేంద్రంలో కలిసి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని కోరగా ఆయన కలెక్టర్‌కు లేఖ రాశారు.

‘అల్ఫోర్స్’లో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, అక్షయ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ కళాశాల ఆవరణలో ఆయా కళాశాలల కరస్పాండెంట్ వి.రవీందర్ మొక్క నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులకు సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ అనేక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న ఈఎంటీ జ్యోతి

మల్యాల(చొప్పదండి):వాహనదారుడిని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మల్యాల మండలం నూకపల్లి శివారులో మంగళవారం చోటుచేసుకుంది. మండలకేంద్రానికి చెందిన పత్తిపాక గంగాధర్ జగిత్యాల నుంచి మల్యాలవైపు వెళ్తున్నాడు. అదే సమయంలో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై నూకపల్లి శివారులో ఆర్టీసీ బస్సు గంగాధర్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో గంగాధర్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడిని 108లో జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

‘డబుల్’ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి



జగిత్యాలలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.32.36 కోట్లతో డ్రెయినేజీ, సీటీ వసతి, విద్యుత్ సౌకర్యం, పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించొద్దని అధికారులను ఆదేశించారు. పీఆర్ ఈఈ రహమాన్, శేఖర్‌రెడ్డి, డెప్యూటీ ఈఈ రాజేశ్వర్, కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు సేవలందించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సేవలందించేలా చూడాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. పిల్లల ఎత్తు, బరువు నమోదు చేయాలని, కేంద్రాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్, సీడీపీవోలు పాల్గొన్నారు.



గొల్లపల్లి: రికార్డులను పరిశీలిస్తూ...

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

గొల్లపల్లి :మండలంలోని చిల్వాకోడూర్ అంగన్‌వాడీ–1 కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రీస్కూల్ పిల్లల బరువును తూకం వేశారు. ఐసీడీఎస్ పీడీ నరేష్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ సాయిబాబా, తహసీల్దార్ జమర్, ఎంపీడీవో రాముురెడ్డి, ఎంపీవో సురేశ్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకీ, కార్యదర్శి రవిరాజ్, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల తీరుపై నిరసన

- ఇప్పపెల్లి గ్రామస్తుల ఆందోళన
- మెట్‌పల్లి డీఎస్పీ హామీతో విరమణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్(వేములవాడ): అటవీశాఖ అధికారుల తీరును నిరసిస్తూ కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లివాసులు మంగళవారం గ్రామ కూడలిలో ఆందోళన చేపట్టారు. గ్రామ శివారు అటవీ భూముల్లోని చెట్లను మూడేళ్లుగా ఇతర గ్రామస్తులు తొలగించి, చదును చేస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కానీ, గ్రామ అవసరాల కోసం ఇటీవల అందరం కలిసి, భూమిని చదును చేస్తే కొందరిపై కేసు పెట్టారంటూ మండిపడ్డారు. ఇతర గ్రామస్తులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి, సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోరుట్ల, మేడిపెల్లి ఎస్సైలు శ్రీకాంత్, శ్యాంరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇళ్లలోకి వెళ్లాలని సూచించినా గ్రామస్తులు పట్టించుకోలేదు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని, ఆందోళనకారులతో మాట్లాడారు. అటవీశాఖ అధికారులు, గ్రామ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు



కల్యాణలక్ష్మీ, సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం త్వరలోనే చేపట్టనుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో 60 మందికి సీఎంఆర్‌ఎఫ్, తొమ్మిది మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఏకకాలంలో రూ.18వేల కోట్ల రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో గంగాధర్, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, సురేందర్, రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

105 గ్రాముల గంజాయి పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు

మల్యాల(చొప్పదండి): గంజాయి తరలిస్తున్న మల్యాల మండలం బల్వంతాపూర్ గిడ్డంగుల్లో పని చేస్తున్న హమాలీలను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సంజు కుమార్ సమీప గ్రామం కావచర్‌లో మంగల్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నాడు. తన అవసరాలకు వినియోగించుకుని, మిగిలింది విక్రయించి, డబ్బు సంపాదించేవాడు. బల్వంతాపూర్‌లోని గోదాముల్లో హమాలీగా పనిచేసేందుకు వచ్చాడు. గంజాయికి అలవాటుపడిన పశ్చిమబెంగాల్‌కు చెందిన మరో హమాలీ చమద్ అలీతో పరిచయం పెంచుకుని ఇద్దరు కలిసి గంజాయి విక్రయించి, డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. నెల క్రితం సంజుకుమార్ సొంత గ్రామానికి వెళ్లాడు. గంజాయి తేవాలని చమద్ అలీ రూ.వెయ్యి ఇచ్చాడు. ఆ డబ్బుతో సంజుకుమార్ గంజాయి కొనుక్కుని బల్వంతాపూర్ వచ్చాడు. మంగళవారం ముత్యంపేట శివారులోని వరదకాలువ చెట్లపొదల్లో గంజాయి పంచుకుని బయటకు వస్తుండగా ఎస్సై నరేశ్‌కుమార్, కానిస్టేబుళ్లు నరేశ్, సత్యనారాయణ, సురేశ్ వెళ్లి పట్టుకున్నారు. వారి నుంచి 105 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖీ వన్‌స్టాప్ సెంటర్‌కు అర్హత గల వ్యక్తుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని సంక్షేమ అధికారి నరేశ్ తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేషన్–1, కేస్‌వర్కర్–1 (మహిళ అభ్యర్థులు మాత్రమే), సెక్యూరిటీ గార్డు–1 (మహిళలు/పురుషులు) ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి అక్టోబర్ 3 వరకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు.

పొగాకుతోనే అనేక వ్యాధులు



జగిత్యాల: పొగాకు వాడడం ద్వారా క్యాన్సర్, వివిధ రకాల వ్యాధులు వస్తాయని, ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని వైద్య కళాశాల సూపరింటెండెంట్ రాములు అన్నారు. జాతీయ వైద్య కమిషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వైద్య సంస్థల్లో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్‌ప్రకాశ్ నడ్డా వర్చువల్ ద్వారా టుబాకో నివారణ కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీసీసీ సెంటర్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య బృందం పాల్గొన్నారు.